క్లుప్తంగా

శబరిమాత ఆశ్రమ వార్షికోత్సవానికి ఆహ్వానం



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆహ్వానిస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: మండలంలోని బుద్దికొండ–తేజాపూర్ గ్రామ సమీపంలో పరమహంస సచ్చిదానంద సద్గురు శ్రీ శబరి మాతాజీ ఆశ్రమ వార్షికోత్సవానికి రావాలని గ్రామస్తులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కోరారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఈనెల 12 నుంచి 29 వరకు వార్షికోత్సవాలు జరగనున్నాయని పేర్కొన్నారు. దేవేందర్ రెడ్డి, ప్రజలు, భక్తులు ఉన్నారు.

ఆదివాసీ పోరాట దినోత్సవానికి తరలిరావాలి



అమరవీరుల స్తూపం వద్ద సమావేశమైన ఆదివాసీ పెద్దలు

ఇంద్రవెల్లి: మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద సోమవారం నిర్వహించే ఆదివాసీ హక్కుల పోరాట దినోత్సవానికి ఉమ్మడి జిల్లా నుంచి ఆదివాసీలు తరలిరావాలని ఆదివాసీ పెద్దలు కోరారు. మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం వారు సమావేశమై చర్చించారు. తుడుందెబ్బ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ పెద్దలు ఆర్క ఖమ్ము, కనక తుకారం, భీంరావ్, రాయిసెంటర్ సార్‌మేడి మెస్రం వెంకట్‌రావ్, ఆదివాసీ సంఘా నాయకులు పుర్క బాపురావ్, మెస్రం శేఖర్‌బాబు, కొట్నాక్ బారిక్‌రావ్, గేడం భారత్, జుగ్నాక్ భరత్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకొని ప్రశాంతమైన జీవనం గడపాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణ శివారులోని బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయాన్ని ఆదివారం దర్శించుకున్నారు. అయ్యప్ప దీక్షదారుల నేతృత్వంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మహా అన్నదానంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



సన్మానిస్తున్న నాయకులు

నార్నూర్: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతి కార్యకర్త కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయాలని పార్టీ మండల అధ్యక్షుడు లోఖండే దేవురావు, సీనియర్ నాయకుడు బానోత్ గజానంద్‌నాయక్ పేర్కొన్నారు. పార్టీ యువజన విభాగంలో ఎన్నికైన వారిని మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ఆదివారం సన్మానించారు. మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షేక్ దాదేఅలి, పీఏసీఎస్ డైరెక్టర్ దుర్గె కాంతరావు, రాథోడ్ దత్తారాం, షేక్ మహ్మద్ ఖురేషి తదితరులు ఉన్నారు.

ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఎస్సై తిరుపతి అన్నారు. స్థానిక బస్టాండ్‌ను ఆదివారం పరిశీలించి కంట్రోలర్‌తో మాట్లాడారు. బస్సులను మండల కేంద్రంలోకి అనుమతించొద్దన్నారు. నిర్మల్, ఆదిలాబాద్ వైపు నుంచి వచ్చే బస్సులు ఇచ్చోడ బస్టాండ్‌కు వచ్చి అటు నుంచి ఆదిలాబాద్ బైపాస్ మీదుగా హైవే మీదుగా వెళ్లాలని సూచించారు. బస్టాండ్ ఆవరణలో ప్రైవేట్ వాహనాలకు అనుమతి లేదన్నారు. ప్రతిరోజు కానిస్టేబుల్ ద్వారా బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నేడు సమీక్ష సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిమ గిరిజన కొలాం సేవ సంఘం, కొలాం విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు కుమ్రం సూరు యువసేన జిల్లా అధ్యక్షుడు కుమ్ర రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి జిల్లాలోని కొలాం తెగకు చెందిన నాయకులు, పెద్దలు, మేధావులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

పల్లెల్లో ‘బెల్టు’దందా

- జోరుగా మద్యం అమ్మకాలు
- బానిసలుగా మారుతున్న యువత
- పట్టించుకోని అధికారులు



మండల కేంద్రంలో ఓ బెల్టుషాపు వద్ద గుమికూడిన మద్యం ప్రియులు

నేరడిగొండ: ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతో పచ్చని పల్లెలు మద్యం విక్రయాలకు నిలయాలుగా మారుతున్నాయి. రోజంతా కష్టపడి పనిచేసే కూలీలకు మద్యం అందుబాటులో ఉండడంతో జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. యువకులు మద్యానికి బానిసలుగా మారి, నేరాలకు పాల్పడుతున్నారు. దీంతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. బెల్టుషాపులు నిర్వహించే వ్యాపారులు పేదల బలహీనతను ఆసరాగా చేసుకొని అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నేరడిగొండ మండల కేంద్రంలో నాలుగు బెల్టుషాపులు ఉండటం గమనార్హం. ఇలా మండలంలోని ఆయా గ్రామాల్లో అధిక సంఖ్యలో బెల్టుషాపులు నడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. గ్రామాల్లో నీరు లభిస్తుందో లేదో తెలియదు గానీ.. మద్యం మాత్రం 24 గంటలు ఏరులై పారుతోంది. దీంతో పలు గ్రామాల్లో ఘర్షణ వాతావరణం పెరుగుతోంది. అధికారులు దాడులు చేస్తారనే సమాచారం ముందుగానే తెలియడంతో దుకాణదారులు అప్రమత్తం అవుతున్నారు.

వేలం పాటతో బెల్టుషాపులు కైవసం

మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గ్రామపెద్దల సమక్షంలో వేలం పాటలు నిర్వహించి బెల్టు షాపులు సొంతం చేసుకుంటున్నారు. వీటిని కొనసాగించేందుకు నిర్వాహకులు వేల రూపాయల్లో నగదు చెల్లించి, మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మారుమూల తండాల్లో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో మద్యం నిషేధిస్తూ పంచాయతీలు తీర్మానం చేసినా, కొన్నిరోజుల తర్వాత రహస్యంగా విక్రయాలు కొనసాగిస్తున్నారు.

దాడులు కరువు

మద్యం అమ్మకాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ దాడులకు వెనుకడుగు వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో అనుమతులు లేకుండా నిర్వహించే బెల్టుషాపులపై దాడులు నిర్వహించక, చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలకు తావిస్తోంది. దీంతో అక్రమార్కులు మరింతగా రెచ్చిపోయి వారి దందాను మూడు పువ్వులు..ఆరు కాయలుగా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

చర్యలు తీసుకుంటున్నాం

గ్రామాల్లో నిర్వహించే బెల్టుషాపులపై దాడులు చేసి చర్యలు తీసుకుంటున్నాం. పల్లెల్లో వేలం పాట నిర్వహించి మద్యం అమ్మకాలు జరిపారనేది మా దృష్టికి రాలేదు. అలాంటి వాటిపై ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తాం. వాహనాలు తనిఖీ చేసి మద్యం తరలించే వారిపై చర్యలు చేపడుతున్నాం.

– ఎండీ జుల్ఫీఖార్ అహ్మద్, ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ



కమ్మేసిన పొగమంచు

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఆదివారం ఉదయం పొగమంచు కమ్మేసింది. పొగమంచుతో రోడ్లు కనిపించకుండా పోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

బార్ కౌన్సిల్ సభ్యుడిగా జిల్లా వాసి



అజయ్‌ను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

ఆదిలాబాద్: తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఇటీవల నియామకమైన సాహా తైక్వాండో క్లబ్ జిల్లా ఉపాధ్యక్షుడు తెలంగ్ అజయ్‌కుమార్‌ను సాహా తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదివారం సన్మానించారు. క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివప్రసాద్, అన్నారపు వీరేశ్ మాట్లాడుతూ తైక్వాండో క్రీడాకారులు ఎంతో ఆత్మస్థైర్యంతో విద్యను నేర్చుకుంటూ చదువుల్లో సైతం గొప్పగా రాణిస్తున్నారన్నారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్నప్పటికీ పార్ట్ టైం జాబ్ చేస్తూ అజయ్ న్యాయవాద వృత్తిలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో బార్ కౌన్సిల్ సభ్యుడిగా నియామకం కావడం గొప్ప విషయమన్నారు.

ఇంట్లో చోరీ

బేల: మండలంలోని డోప్టాల గ్రామంలో కుంచల విఠల్ ఇంట్లో ఆదివారం గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మధ్యాహ్నం ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 3 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.35వేల నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దివ్యభారతి తెలిపారు.

నిర్మించారు.. వదిలేశారు!

- బేల బస్టాండ్‌లో ప్రారంభించని టాయిలెట్లు
- ఇబ్బందులు పడుతున్న మహిళలు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



బేల బస్టాండ్‌లో నిర్మించిన టాయిలెట్లు

బేల: మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో ప్రత్యేకంగా మహిళా ప్రయాణికుల సౌకర్యార్థం టాయిలెట్స్ నిర్మించారు..వదిలేశారు..! అన్నట్లుగా మారింది. ఈ టాయిలెట్ల ప్రారంభమెప్పుడోనని మహిళా ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. మహాలక్ష్మి పథకం క్రింద రూ.7 లక్షలతో చేపట్టిన టాయిలెట్ల పనులు గతనెల క్రితమే పూర్తయ్యాయి. అయినా ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా..ప్రతిరోజు ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు 15కు పైబడి మన ఆర్టీసీ బస్సు ట్రిప్పులు ఉన్నాయి. దీంతోపాటు మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు ట్రిప్పులు అదే సంఖ్యలో ఉండడంతో వందల సంఖ్యలో అంతరాష్ట్ర ప్రయాణికుల రాకపోకలు ఉంటాయి. ఈమార్గంలో బేల బస్టాండ్ చివరి స్టాప్‌కావడంతో ఒంటికి, రెంటికి మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో పాత టాయిలెట్లు శిథిలావస్థకు చేరాయి. వీటిని తొలగించి నూతనంగా నిర్మించిన టాయిలెట్లను అందుబాటులోకి తేవాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

రూ.7లక్షలతో టాయిలెట్ల నిర్మాణం..

మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో టాయిలెట్ల నిర్మాణానికి గత ఆరునెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద నిధులు రూ.7 లక్షలు మంజూరు చేసింది. ఈక్రమంలో రెండు నెలలకు ఆ శాఖ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కాంట్రాక్టర్‌తో టాయిలెట్ల పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకు నిర్మాణంతోపాటు వాటర్ ట్యాంకు ఏర్పాటు కాంక్రీటు స్టాండ్ నిర్మాణం, పైప్‌లైన్ పనులు పూర్తిచేశారు. వీటి నిర్వహణకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నీటి సౌకర్యం కోసం మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ ఇచ్చారు. కాగా, ఈ భగీరథ నీరు రాని సమయంలో ప్రత్యామ్నాయంగా బోరు సౌకర్యం ఏర్పాటు చేయించలేదు. దీంతో టాయిలెట్ల ప్రారంభం ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి టాయిలెట్ల ప్రారంభంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మహిళా ప్రయాణికులు కోరుతున్నారు.

ముంపు గ్రామంపై చిన్నచూపు?

- బ్యాక్‌వాటర్‌తో ముంపుగా మారిన దేగామ
- పరిహారం కోసం బాధితుల ఎదురుచూపు
- పట్టించుకోని అధికారులు



దేగామలో ముంపునకు గురై శిథిలావస్థకు చేరిన ఇల్లు

బజార్‌హత్నూర్: మండలంలోని బజార్‌హత్నూర్ సమీపంలో 2002లో రూ.14.15 కోట్లతో 4,700 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించాలనే లక్ష్యంతో చిన్నతరహా సాగునీటి ప్రాజెక్టు నిర్మించారు. అయితే ఈ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో దేగామ గ్రామం ముంపునకు గురైంది. వర్షాకాలం వరద పోటెత్తడంతో ఇళ్లలోకి వరద నీరు చేరి నేలమట్టమయ్యాయి. వర్షాకాలంలో పాములు, తేళ్లు రావడంతో గ్రామస్తులు భయంభయంగా ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని గడుపుతున్నారు. ప్రభుత్వ సాయం కోసం పలువురు ఎదురుచూస్తున్నారు. గ్రామంలో 479 ఇళ్లు ఉంటే ముంపు బాధితుల పునరావాసం కింద జీవో 17 ప్రకారం 2002–03లో దేగామ ఎగువ ప్రాంతంలోని సర్పంచ్ గూడ గ్రామ సమీపంలో తొలివిడతలో 77 ఇళ్లు నిర్మించి ఇచ్చారు. 2005లో రెండోవిడతలో 74 ఇళ్లు నిర్మించి ఇచ్చారు. మిగతా గ్రామాన్ని ఎగువ ప్రాంతంలో తరలించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. ప్రాజెక్ట్ ముంపు ప్రాంతానికి 100 మీటర్ల పరిధిలో ఉన్న మిగతా 198 ఇళ్లను తొలగించి గ్రామం మొత్తాన్ని ఎగువ ప్రాంతంలో నిర్మించి ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.

గ్రామం మొత్తాన్ని తరలించాలి



దేగామలో వర్షాకాలం వరద నీరు రావడమే కాకుండా ఇళ్లలోకి పాములు, తేళ్లు వస్తున్నాయి. వేసవికాలం వరకు గ్రామం చుట్టూ ప్రాజెక్టు నీళ్లు ఉండడంతో చిన్నపిల్లలు ఆడుకుంటు వెళ్లి అందులో పడుతున్నారు. గత పదేళ్లలో 10 మంది నీటమునిగి చనిపోయారు. ప్రభుత్వం గ్రామం మొత్తాన్ని తొలగించి ఎగువ ప్రాంతంలో మిగతా 198 ఇళ్లను నిర్మించి ఇవ్వాలి.

– మర్రి కళావతి, దేగామ

నివేదించాం

దేగామలో 198 ఇళ్లు ముంపునకు గురవుతున్న దృష్ట్యా బాధితుల అభ్యర్థనల మేరకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం. బాధిత కుటుంబాలు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరినా నీటిపారుదలశాఖ నిబంధనల ప్రకారం సాధ్యం కాలేదు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని గ్రామస్తులు విన్నవించారు.

– శంకర్, తహసీల్దార్

ఆలయానికి విరాళంగా తొలి వేతనం



విరాళాన్ని అందిస్తున్న ఉపాధ్యాయుడు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడకు చెందిన ఉపాధ్యాయుడు ఘన్ శ్యామ్ తన తొలి నెల వేతనాన్ని సంజయ్‌నగర్ పంచముఖి హనుమాన్ ఆలయానికి అందించాడు. ఘన్ శ్యామ్ పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో గత పదేళ్లుగా అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల డీఎస్సీలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ఎంపికకాగా, భీంపూర్ మండలం రాజులవాడిలో విధులు నిర్వహిస్తున్నాడు. తన మొదటి నెల వేతనం రూ.39,100ను చెక్కు రూపంలో ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందించాడు. ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు ఘన్ శ్యాం దంపతులను సన్మానించారు.

వృద్ధులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ఆరోగ్య అలవాట్లు సక్రమంగా పాటిస్తే ఎలాంటి వ్యాధులు రావని జిల్లా సంక్షేమాధికారి సబిత అన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లోని 99 ఏళ్ల వయోవృద్ధురాలు చిల్వేరి నర్సుబాయి ఇంటిని ఆదివారం సందర్శించి ఆమె బాగోగులను అడిగి తెలుసుకున్నారు. వయోభారం ఉన్నప్పటికీ బీపీ, షుగర్ లేకుండా ఆరోగ్యంగా ఉన్నారని పేర్కొన్నారు. రోజు తీసుకునే ఆహారంపై ఆధారపడి ఉంటుందన్నారు. వయోవృద్ధులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. పోశెట్టి, దేవిదాస్ దేశ్‌పాండే, కులకర్ణి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



బావిలో చెత్తాచెదారం

నార్నూర్: మండల కేంద్రంలోని అదర్శనగర్ (జీన్‌గూడ)లో తాగునీటి బావిలో చెత్తాచెదారం ఉంది. బావి చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో చుట్టుపక్క వారే వాటిని తొలగించారు. పంచాయతీ అధికారులు పట్టించుకుని బావిలో చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్ వేసి క్లోరినేషన్ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పూజలు



నేరడిగొండ: అయ్యప్ప పల్లకిసేవలో భక్తులు

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో అయ్యప్ప పల్లకిసేవను ఆదివారం నిర్వహించారు. స్వాములు ప్రత్యేక పూజలు చేసి పల్లకి సేవ ప్రారంభించారు. మహిళలు మంగళహారతులతో పల్లకికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలోని పురవీధుల గుండా అయ్యప్ప పల్లకిని ఊరేగించారు. అనంతరం సాయిబాబా ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



ఇచ్చోడ: అయ్యప్ప పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ప్రధానవీధుల గుండా ఊరేగించారు. స్వాములు నృత్యాలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

అంగన్‌వాడీ ఆయా మృతి



నగదు అందిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న తమ్మిని కళాబాయి (60) శనివారం ఆకస్మికంగా మృతి చెందింది. అంత్యక్రియల నిమిత్తం ఆదివారం ఐసీడీఎస్ శాఖ ద్వారా జైనథ్ సూపర్‌వైజర్ ముంతాజ్ బేగం రూ.10 వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

‘తప్పుడు ప్రచారం మానుకోవాలి’

ఎదులాపురం: మాజీ ఎంపీ సోయం బాపూరావుపై ఎంపీ గోడం నగేశ్ తప్పుడు ప్రచారం మానుకోవాలని సోయం యువసేన జిల్లా అధ్యక్షుడు అక్కపల్లి లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ఎంపీ నగేశ్ ఇదివరకు ఎంపీగా ఉన్న సమయంలో ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.17.50 కోట్లు ఖర్చు చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయన్నారు. ఎంపీగా గెలిచిన తమ నాయకుడు సోయం బాపురావు తిరిగి తెప్పించి జిల్లా అభివృద్ధికి ఖర్చు చేశారన్నారు. సోయం బాపూరావు ఎంపీగా ఉన్న సమయంలో ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ సర్వే కోసం రూ.17 కోట్లు నిధులు మంజూరు కాగా, ప్రస్తుత ఎంపీ గోడం నగేశ్ తానే మంజూరు చేయించినట్లు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు.

నేడు సమావేశం

బోథ్: సొనాలను మండలాన్ని ప్రకటించడంతో తదుపరి కార్యాచరణపై చర్చించడానికి గ్రామంలోని రైతువేదికలో సోమవారం ఉదయం 9 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు సొనాల సాధన మండల కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, యువజన సంఘాలు, గ్రామపెద్దలు హాజరుకావాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899